క్లుప్తంగా

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిది



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌నాయక్

కాసిపేట: వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిదని డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ సూచించారు. మండలంలోని గురువాపూర్‌లో శుక్రవారం అటవీ అధికారుల ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణ, అగ్నిప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ జంతువుల తాగు నీటి కోసం చెక్‌డ్యాంలు, కుంటలు నిర్మించినట్లు తెలిపారు. వన్యప్రాణులు దారితప్పి గ్రామాల్లోకి వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమీపంలోని పంటచేన్లలో పత్తి కర్ర కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అటవీలో మంటలు, అగ్నిప్రమాదం జరగకుండా చూసుకోవాలన్నారు. బీట్ ఆఫీసర్ సురేష్, గ్రామపటేల్ భీము, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాయాగం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఉప్పలయ్య

మంచిర్యాలక్రైం: జిలాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత క్రీడామైదానంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించే మహాయాగాన్ని విజయవంతం చేయాలని కౌన్సిలర్ రావుల ఉప్పలయ్య కోరారు. ఎమ్మెల్యే నివాసగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వనాథ ఆలయం నుంచి శనివారం శోభాయాత్ర ప్రారంభమై పురవీధుల గుండా బాలుర ఉన్నత క్రీడామైదానం సాగుతుందన్నారు. స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల శుద్ధి



ఊడుస్తున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు మండలంలోని ఆలయాల్లో శుద్ధి నిర్వహించారు. స్థానిక అంగడి బజార్‌లోని హనుమాన్ ఆలయ ఆవరణలో బీజేపీ నాయకులు చెత్తను ఊడ్చి, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేశారు. నాయకులు హరిగోపాల్, కిషన్, తమ్మినేటి శ్రీనివాస్, వేముల మధు, పంచాల రమేశ్, శివశంకర్, సతీశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం వాయిదా పడింది. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని అధికారులు అకస్మికంగా వాయిదా వేసినట్లు సభ్యులకు గురువారం రాత్రి ఫోన్‌ద్వారా తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ అందుబాటులో లేకపోవడంతో అనివార్యంగా సమావేశం వాయిదా వేసినట్లు సమాచారం.

వంట సామగ్రికి విరాళం

దండేపల్లి: మండలంలోని పాత మామిడిపల్లి ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన సాయిరెడ్డి రాంరెడ్డి దంపతులు రూ.లక్ష విలువ చేసే వంట సామగ్రిని శుక్రవారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి రాంరెడ్డి దంపతులు చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. మాజీ సర్పంచ్ తిరుపతి, విద్యాకమిటీ చైర్మన్ మల్లేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

మందమర్రిరూరల్: సారంగపల్లిలో ఎమ్మార్పీఎస్ మందమర్రి మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆసంపల్లి శివకుమార్, గౌరవ అధ్యక్షుడిగా రాజర్ల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా మేరుగు ప్రభాకర్, కార్యదర్శిగా ఆసంపల్లి అఖిల్, కోశాధికారిగా తైదల మారుతి ఎన్నికయ్యారు. మండల ఇన్‌చార్జి జీడి సారంగం, పట్టణ కన్వీనర్ చిలుముల రాజ్‌కుమార్ తదితరులు వారిని అభినందించారు.

నిలిచిన రోడ్డు పనులు

- అసంపూర్తిగా మద్దికల్–ఎలకేశ్వరం బీటీ రోడ్డు
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు



మద్దికల్–ఎలకేశ్వరం మధ్య కంకరతేలిన రోడ్డు

భీమారం: మండలంలోని మద్దికల్ నుంచి ఎలకేశ్వరం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గత ప్రభుత్వం మద్దికల్ నుంచి ఎలకేశ్వరం గ్రామ పొలిమేర వరకు బీటీ రోడ్డు, ఎలకేశ్వరంలో సీసీరోడ్డు నిర్మాణాలకు రూ.1.08 కోట్ల నిధులు మంజూరు చేసింది. మంచిర్యాల ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. గత ఆరునెలల క్రితం రోడ్డు పనులు ప్రారంభించారు. కేవలం మట్టి రోడ్డును చదునుచేసి దానిపై కంకరవేశారు. రోలింగ్‌చేసి బీటీ వేయాల్సి ఉండగా అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎలకేశ్వరం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టిపోయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే దాటలేని పరిస్థితి నెలకొంది.

వర్షాకాలం వస్తే ఇబ్బందులు

మద్దికల్ నుంచి ఎలకేశ్వరం వరకు 3 కి.మీ దూరం మట్టిరోడ్డు వల్ల వర్షాకాలంలో బురదమయంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బీటీ రోడ్డు నిర్మించాలని అప్పటి ప్రభుత్వ విప్ బాల్కసుమన్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభించడంతో రెండు గ్రామాల ప్రజలు సంతోషపడ్డారు. ఎన్నికల నేపథ్యంలో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. ఎలకేశ్వరం గ్రామంలో మెజార్టీ కుటుంబాలు గిరిజనులు ఉన్నాయి. వర్షాకాలం వస్తే వీరి ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అటు భీమారం వైపు వెళ్దామన్నా మట్టిరోడ్డే దిక్కు, మరోవైపు మద్దికల్ వైపు ఇదే పరిస్థితి ఉందని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి



రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిపివేయడంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది అవుతోంది. రోడ్డు పనులు ప్రభుత్వం త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలి.

– శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామస్తుడు, ఎలకేశ్వరం

ప్రభుత్వ అనుమతి రాగానే పనులు

ప్రభుత్వ అనుమతి రాగానే ఎలకేశ్వరం నుంచి మద్దికల్ వరకు పనులు ప్రారంభిస్తాం. ఎన్నికల నేపథ్యంలో అప్పట్లో పనులు నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టిపోయిస్తాం.

– రాజమౌళి, జెడ్పీ ఏఈ

సీనియర్ అసిస్టెంట్‌ను తొలగించాలి

- సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

కాసిపేట: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒకరు డిప్యూటేషన్ పేరుతో ఏళ్ల తరబడి విధులు నిర్వహించడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ రోడ్డ లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడారు. ఏళ్ల తరబడి జీతం తీసుకుంటూ పైరవీలతో విధులు మరోచోట చేస్తున్నారని, అతన్ని విధుల్లో నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేకు పీఏగా పనిచేసి ప్రస్తుతం జెడ్పీలో పని చేస్తున్నట్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. కాసిపేట మండలానికి సీనియర్ అసిస్టెంట్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సభ్యులందరు కలిసి తీర్మానం చేశారు. ఈ అంశం మినహా సమావేశం సాదాసీదాగా కొనసాగింది. శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఏ అలీం, జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావు, ఏవో వందన, ఎంపీవో వందన, ఏపీఎం వెంకటేశ్, సర్పంచులు వేముల కృష్ణ, సపాట్ శంకర్, ఎంపీటీసీలు రాంచందర్, చంద్రమౌళి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపు

దప్పు సమ్మయ్య సంతాప సభ

నస్పూర్: తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడు డప్పు(శ్రీరాముల) సమ్మయ్య సంతాప సభ ఈ నెల 21న సాయంత్రం 5గంటలకు నస్పూర్ కాలనీలోని సేవాభవన్‌లో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా కళాకారులు తెలిపారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారులు, స్వర మాధురి కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించే సంతాప సభకు ఓయూ ప్రొఫెసర్ ఖాసీం, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపక అధ్యక్షుడు అంతడుపుల నాగరాజు, సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కళాకారులు రేగుంట చంద్రశేఖర్, మామిడి లక్ష్మణ్, పోశం, గజెల్లి రాజలింగు, గడ్డం రమేశ్, కొప్పర్తి సురేందర్, రవీందర్, సంతోష్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

భీం విగ్రహ ఆవిష్కరణ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో ఆటోస్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం ఆదివాసీల ఆరాధ్యదైవం కుమురం భీం విగ్రహావిష్కరణ ఉంటుందని ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విగ్రహ ఆవిష్కరణకు అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యనిర్వాహక కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలో పరిష్కారం

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



దండేపల్లిలో మాట్లాడుతున్న సత్యనారాయణ

దండేపల్లి: ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలో పరిష్కారమవుతాయని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్‌ను దండేపల్లిలో శుక్రవారం సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఐదో తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్న డిసెంబర్ వేతనాన్ని చెల్లించిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వంపై మరింత నమ్మకం పెరిగిందన్నారు. 317 జీవో ద్వారా ఉత్పన్నమైన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, గంగాధర్, రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, దండేపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇప్ప రవి, లచ్చన్న, లక్సెట్టిపేట మండల అధ్యక్షుడు రామన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్యనారాయణకు మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం వినతిపత్రం అందించారు. మండల నోడల్ అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఆయన్ను సన్మానించారు. సీసీవో మల్లేశ్, సీఆర్పీలు సురేందర్, నర్సయ్య, రమేశ్, రాజ్‌మహమ్మద్, శ్రావణ్, మెసెంజర్ పోచన్న పాల్గొన్నారు.

నేను అందరిలా కాదు..తప్పుచేస్తే వదలను

- జవాబుదారీతనంగా పనిచేయాలి
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం: అధికారులు ప్రజలు మెచ్చేలా, ప్రజలకు జవాబుదారితనంగా పని చేయాలని, నేను అందరిలా కాదు తప్పు చేస్తే ఎవరినీ వదలనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం జరిగింది. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు శాఖల వారీగా నివేదికలను తీసుకురావాలని సూచించారు. ప్రతి అంశం, పని వివరాలు రికార్డుగా తయారు చేయాలన్నారు. ఇప్పటి వరకు జన్నారం మండలానికి విడుదలైన నిధులు, చేపట్టే పనుల వివరాలను నివేదిక తయారు చేయాలన్నారు. ప్రతిపక్షమైనా, అధికార పక్షమైన పని చేసేది ప్రజల కోసమేనని, వారికి మంచి జరుగుతుందనుకుంటే అందరితో కలిసి వస్తానని అన్నారు. అదేవిధంగా బెల్టు దుకాణాలు, గుడుంబారహిత ఖానాపూర్ నియోజకవర్గంగా తయారు చేయాలని ఎక్సైజ్ ఎస్సై భవానికి సూచించారు. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని, చాలా గ్రామాలకు కుళాయిలు బిగించలేదన్నారు. వచ్చే వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అటవీ అధికారులు చెక్‌పోస్టుల వద్ద డబ్బులు రిషిష్వ రూపంలో తీసుకుంటున్నారని, వసూలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. టైగర్‌జోన్ పేరుతో లేని నిబంధనలు తెచ్చి ప్రజలకు ఇబ్బంది పెట్టవద్దన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీడీవో అరుణరాణి, రేంజ్ అధికారి హఫీజోద్దీన్, ఎంఈవో విజయ్‌కుమార్, సీడీపీవో రేష్మ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

డబ్బులు తీసుకుంటే చర్యలు

సమావేశం ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడారు. రేపు, మాపు అని లేనిది ఉన్నట్లు, అబద్దాలు చెప్పడం సరికాదు. ఇలాంటి సమావేశాల్లో సభ్యుల నుంచి ఆరోపణలు ఎదుర్కోవడం ఎందుకు. మీ పని మీరు సరిగ్గా చేయాలి. అబద్ధం ఆడిన పనులకు డబ్బులు తీసుకున్న అధికారులు, నాయకులు, కార్యకర్తలైనా చివరికి నా తమ్ముడైనా చర్యలు తీసుకోవాల్సిందేనని హెచ్చరించారు.

దేశభక్తిని పెంపొందించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: యువతను మత్తు పదార్థాలు ముంచెత్తుతున్నాయని, వీటి బారి నుంచి కాపాడడానికి దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు విస్తృతం చేయాలని బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల ఐనాల సైదులు అన్నారు. స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వారంపాటు సీఓఈలో నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమాలు జరిగాయి. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రేణులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కాసిపేట బాలుర, బెల్లంపల్లి సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాళ్లు సంతోష్‌కుమార్, సందరాజా స్వరూప, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నెహ్రూ యువకేంద్రం యూత్ ఆఫీసర్ సుశీల్ భాడే, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలక్రైం: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు జిల్లా కన్వీనర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఫిబ్రవరి 15లోపు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు www. mjptbc wreis.telangana.gov.in,www.mjptbcwreis.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

మహిళా సాధికారిత దిశగా హబ్ కృషి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తోందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక అన్నారు. శుక్రవారం హాజీపూర్ పంచాయతీ ఆవరణలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో వారు మాట్లాడారు. జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలియజేస్తూ బేటీ బచావో..బేటీ పడావో, బాలికలు, మహిళల సంరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. లింగ వివక్షణ, బాలిక విద్య, బాల్య వివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్–బాడ్ టచ్, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. డీపీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ అబ్దుల్‌హై, సర్పంచ్ జూపాక రాజేశ్వరి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, ఆశకార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

జైపూర్: సమాజంలో బాలికలపై వివక్ష పోవాలని పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో పోటీపడుతున్నారని మహిళా సాధికారత కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య తెలిపారు. మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మహిళా గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. బాలికలు ఎదుర్కొంటున్న పలు అంశాలను వివరించారు. జెండర్ స్పెషలిస్ట్ విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, సర్పంచ్ కుంటాల సౌజన్య, అంగన్‌వాడీ, ఆశలు తదితరులు పాల్గొన్నారు

ఓటరుగా నమోదు చేసుకోండి

చెన్నూర్: జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈనెల 20, 21న నూతన ఓటర్ల నమోదు కోసం ప్రతి పోలింగ్ బూత్‌ల్లో బీఎల్వోలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. డీటీ ప్రకాశ్, ఆర్‌ఐ గణేశ్ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో బీఎల్వోలతో తహసీల్దార్ విశ్వంబర్ మాట్లాడారు. 18 ఏళ్లనిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆర్‌ఐ ప్రవంతి ఉన్నారు.

‘అరుణ్‌కుమార్‌కు మార్కెట్ చైర్మన్ ఇవ్వాలి’

చెన్నూర్: కాంగ్రెస్ పార్టీ కోసం 18 ఏళ్లుగా కష్టపడిన భీమారం గ్రామానికి చెందిన తంగళ్లపల్లి అరుణ్‌కుమార్‌కే చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలని ఎమ్మెల్యే వివేక్‌కు లేఖ పంపించినట్లు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్ చైర్మన్ పదవీ ఆయకే ఇవ్వాలని జిల్లా సర్పంచ్ సంఘం తీర్మానం చేసిందని పేర్కొన్నారు. అధిష్టానం జెండామోసిన వాడికి గుర్తింపు ఇస్తే రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

నేడు

విద్యుత్ అంతరాయం

జైపూర్: జైపూర్, ఇందారం, పౌనూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 25 గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

జన్నారంలో..

జన్నారం: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని లక్సెట్టిపేట ఏడీఈ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ మరమ్మతు కారణంగా సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండల స్థాయిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీపీ ప్రణయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థినులకు మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. ఉన్నత చదువుల లక్ష్యాన్ని సాధించడానికి పాటించాల్సిన మెలకువలు వివరించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం జరిగే నవోదయ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి తెలిపారు. 143 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం 11:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, గంట ముందుగా చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

బాలకార్మికుడిని పాఠశాలలో చేర్పించిన అధికారులు

భీమారం: మండల కేంద్రంలోని మెకానిక్ షెడ్‌లో పనిచేస్తున్న బాల కార్మికుడిని చైల్డ్ కేర్ అధికారి రాజశేఖర్ గుర్తించి శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో చేర్పించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఏఎస్సై శకుంతల ఆధ్వర్యంలో వివిధ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. హెచ్‌ఎం విక్రమ్, హెడ్ కానిస్టేబుల్ జగన్ ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత చెన్నూరు

వేమనపల్లి: మండల కేంద్రంలో మూడురోజులుగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా చెన్నూర్ టీమ్ నిలిచింది. విజేతకు ఎంపీటీసీ సంతోష్‌కుమార్ రూ.12,500 నగదుతోపాటు షీల్డ్, రన్నరప్‌గా నిలిచిన వేమనపల్లి వాలీబాల్ టీమ్‌కు రూ.6 వేల నగదు, షీల్డ్ అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ, నీల్వాయి సర్పంచ్ గాలి మధు, మాజీ సర్పంచ్ తోకల రామచంద్రు, శేఖర్, పురుషోత్తం, రమేశ్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

వేమనపల్లి: మండలంలో అయోధ్య రాముడి అక్షింతలతో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. మంగళహారతులతో మహిళలు వెంట రాగా బాజభజంత్రీల మధ్య విశ్వేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకన్న, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ దీక్ష స్వీకరణ

దండేపల్లి: అయోధ్యలో ఈనెల 22న నిర్వహించనున్న బాల రాముని ప్రాణప్రతిష్ఠలో భాగంగా కొత్త మామిడిపెల్లిలో పలువురు భక్తులు శ్రీరామ దీక్ష చేపట్టారు. సురేందర్, అంజన్న, శంకరయ్య, సాంబయ్య, చింటు, మల్లేశ్, నరేశ్ ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం గాయత్రి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆర్.రవి, కృష్ణలను శుక్రవారం సన్మానించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, సర్పంచ్ శంకరయ్య, ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఎస్ఎంసీ చైర్మన్ విజయ, ఎంపీటీసీ మల్లవ్వ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథలకు చేయూత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆనంద నిలయంలోని వృద్ధులు, అనాథలు, అమృతహస్తం వెల్ఫేర్ సొసైటీలోని అనాథ, వృద్ధులకు చేయూతగా నిలిచారు. సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శరత్‌కుమార్, ఆర్‌ఐలు శ్రీనివాస్, భాస్కర్, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలు తొలగించాలి

భీమారం: భీమారంలోని ఊర చెరువులో వ్యర్థాలను తొలగించాలని కాంగ్రెస్ మండల నాయకులు, యువకులు ఎంపీడీవో శ్రీనివాస్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అన్నదానం

చెన్నూర్: పట్టణంలోని సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో మాజీ ఎంపీపీ సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం వృద్ధులకు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డితో అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు రవి, బషీరొద్దీన్, ఖలీలొద్దీన్, హజు, శ్రీనివాస్, తనుగుల రవి పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

మంచిర్యాలక్రైం: జిల్లాలో బినామీ రేషన్ డీలర్ల తొలగించాలని ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని పలు రేషన్ షాపులను ఆర్‌ఐ అజీజ్ తనిఖీ శుక్రవారం చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట వీఆర్‌ఏ దశరథం ఉన్నారు.

మానవత కేంద్రం ఏర్పాటు

కోటపల్లి: బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సేకరించిన దుస్తులు, వస్తువులతో హెచ్‌ఎం బుచ్చన్న ఏర్పాటు చేసిన మానవత కేంద్రాన్ని ఎంఈవో తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. నోడల్ ఆధికారి మొగిలి, సీఆర్పీ సంపత్ ఉన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం చేపట్టిన దీక్షలో రాజం, హన్మంతు, చెన్న లింగయ్య, జ్యోతి, రజిత పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలి

కాసిపేట: మండలంలోని కేకే ఓసీపీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంలో 18 ఏళ్లు నిండినవారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ప్లాట్లు ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ కోరారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో సురేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో డిసెంబర్ 2021 వరకు 18 ఏళ్లు నిండినవారికి ప్యాకేజీ ప్రకటించారని గుర్తు చేశారు. యాజమాన్యం గత పాలకుల కారణంగా ఆలస్యమైనందున 2023 వరకు 18 ఏళ్లనిండిన యువతి, యువకులకు అందరికీ ప్యాకేజీ అందించాలని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన

జైపూర్: మండలంలోని మిట్టపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పొలాస, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రతినిధి ముత్యం తిరుపతి, ఏఈవో కొమురయ్య నేతృత్వంలో శుక్రవారం రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రతి మూడు పంటలకోసారి మట్టి పరీక్ష చేయాలని, ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ సౌజన్య, ఉపసర్పంచ్ మధునయ్య పాల్గొన్నారు.

పోలీసుల కళాజాత

జన్నారం: రామగుండం సీపీ ఆదేశాలతో బాదంపల్లిలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నిషేధంపై పోలీసుల కళాజాత బృందం శుక్రవారం ప్రదర్శన చేశారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణ మాట్లాడుతూ అపరిచితులు ఫోన్ చేస్తే వివరాలు చెప్పొద్దన్నారు. సర్పంచ్ అశోక్‌రావు, ఎస్సై సతీశ్, ఉపసర్పంచ్ ఆనందం ఉన్నారు.